# మానవత్వములో ఉండిన అహంకారమును నిర్మూలించటానికి పరిశుద్ధమైన ప్రేమను భగవంతునికి అర్పించాలి

**చిత్తశుద్ధిలేని రిత్తమానవులందు**
**క్రోధమత్సరములు కూడియుండు**
**చీకటింటిలోన చేరును గబ్బిలాలు**
**మరువబోకుడిట్టి మంచిమాట.**

దివ్యాత్మ స్వరూపులారా!

ప్రతి మానవుడు పుట్టినప్పుడు ఎట్టి దుర్గుణములుగానీ, ఎట్టి సుగుణములుగానీ లేక నిర్గుణుడుగా జన్మించుచున్నాడు. కాలము గడచినకొలది, ఆహారము మార్పుచెందినకొలది, కొన్ని ఆశయాలు అభివృద్ధి అయ్యేకొలది, మానవునియొక్క జీవితము అనేక విధములైన మార్గములలో ప్రవేశించుచున్నది. సహవాస దోషములతో వేషములు మార్చుకొని అభిమాన, అహంకారములను పెంచుకుంటున్నాడు మానవుడు. విద్యామార్గములో ప్రవేశించిన తక్షణమే అనేక రాగద్వేషభావములతో మానవుడు తన జీవితమును మాలిన్యము చేసుకుంటున్నాడు. విద్యకంటే ముందుగనే శరీరమునందు ఆపాదమస్తకము ఈ దుర్గుణములు వ్యాపించి వీరవిహారము సలుపుచున్నవి. తనకంటె మించినవాడు యీ జగత్తులో లేడని గర్వించుచున్నాడు, మానవుడు. లోకములోని మానవులందరికంటె నేనే ఉత్తముడనని భావించి తనకు తాను ఆనందించుచున్నాడు.

**ప్రేమాగ్నియందు సంస్కరింపజేసినప్పుడే దుర్గుణములు దూరమై చిత్తము నిత్యనిర్మలంగా రూపొందుతుంది**

ఇవన్నీకూడను చిత్తశుద్ధి లేని రిత్త భావములే! పరిశుద్ధమైన పాలు జలముతో చేరి తమ

sri sathyasaivachanamrutam

విలువను క్షీణింపచేస్తున్నవి. పాలలో చేరిన జలమును వేరు చేయుటకు ఏ మంత్రమో, ఏ యంత్రమో, ఏ తంత్రమో పనికి రాదు. పాలను చక్కగా అగ్నిపై మరగబెట్టినప్పుడే యీ పాలలో చేరిన జలము ఆవిరి రూపములో పాలను విడచి వేరవుతున్నది. అటులనే పరిశుద్ధమైన మానవుని హృదయములో అపవిత్రమైన గుణములు చేరి మానవత్వమును నిర్మూలము గావించుచున్నవి. విలువను తగ్గించుచున్నవి. యీ దుర్గుణములు, దురాచారములు వేరు చేసుకునే నిమిత్తమై మానవుడు అనేక విధములైన సాధనలు సలుపుచున్నాడు. జపము, ధ్యానము, భజన, యజ్ఞయాగాదిక్రతువులు ఆచరించి తనలో ప్రవేశించిన యీ దుర్గుణములు దూరము గావించుకొనుటకు మానవుడు ప్రయత్నిస్తున్నాడు. కానీ, ఈ సాధనలన్నీ కేవలము అల్ప మనస్సులకు తృప్తినందించునవేగానీ దుర్గుణములను హృదయమునుండి దూరము గావించుకొనడానికి తోడ్పడేవి కాదు. ఈ పరిశుద్ధమైన హృదయమునందు చేరిన మాలిన్యమైన గుణములను వేరుచేసుకోవలెనన్న దానిని దివ్యమైన భగవత్ప్రేమ అనే అగ్నిలో యిది కాల్చాలి. దీనినే 'సంస్కారము' అని పిల్చారు. ప్రేమాగ్నియందు సంస్కరింపచేసినప్పుడే దుర్గుణములు దూరమై సహజస్వరూపమైన చిత్తము నిత్యనిర్మలంగా రూపొందుతుంది. సూర్యకిరణములు లేక సూర్యుని వేడి ప్రత్తిని దహించలేవు. కిరణములు ఎంతటి సూటివైనప్పటికిని, తీక్షణమైనవి అయినప్పటికిని, ప్రత్తిని దహించజాలవు. సూర్యునకు, ప్రత్తికి మధ్యన భూతద్దము పెట్టినప్పుడే ఆ అద్దముయొక్క సహాయముచేత క్రిందనున్న ప్రత్తి భస్మమైపోతుంది! అదే విధముగ బుద్ధి అనే సూర్యకిరణములకు, దుర్గుణములనే మాలిన్యమనే ప్రత్తికిని మధ్యలో ప్రేమ అనే భూతద్దము నిలిపినప్పుడే యీ అద్దముద్వారా మాలిన్యమైన ప్రత్తి భస్మమైపోతుంది.

### భ్రమయే మాయ, బ్రహ్మయే దైవము

ఆత్మాభిమానము స్వర్గమని, దేహాభిమానమే నరకమని మనకు స్పష్టమవుతున్నది. కానీ, మానవుడు దేనిని అనుభవిస్తున్నాడు? కేవలము దేహాభిమానమునే అనుసరిస్తున్నాడుగానీ, ఆత్మాభిమానమును అనుసరించటం లేదు. యీనాటి మానవునకు చిల్లర భావములే

sri sathyasaivachanamrutam

గోచరిస్తున్నాయి. ఈనాటి మానవుడు పరిశుద్ధమైన, పవిత్రమైన, దివ్యమైన భావములు ఏమాత్రం అభివృద్ధి గావించుకోటం లేదు. మానవుడు కోరికలనే దీనిలో ప్రవేశించి మానవత్వమును మరచిపోతున్నాడు.

**మానవత్వమొచ్చె మాధవులోనుండి**
**మాధవత్వమేల మరుగుపడియె?**
**మాయ మాయ యిదియె మహిలోన నరుడయ్యె**
**మాయనరుడె కాదె మానవుండు.**

మాయ, మాయ, మానవత్వము. యిలాంటి 'మాయ' అనగా ఏమిటి? భ్రమయే మాయ, బ్రహ్మయే దైవము. మాయ ఉండినంతవరకు, భ్రమ ఉండినంతవరకు బ్రహ్మ మనకు అర్థము కాదు. కోరికలు తప్పుకాదు. కోరికలు ఉండవలసినదే! కానీ, మితిమీరిన కోరికలు మానవునికి మతిభ్రమణము కలిగిస్తున్నవి. మానవత్వంలో యవ్వనము మరింత ప్రమాదకరమైనది. యీ యవ్వనమువల్లనే మానవత్వము భిన్నత్వముగా మారిపోతున్నది. యవ్వనమందు మానవుడు ఎదుటి మనిషిని గడ్డిపోచవలె చూస్తాడు. దేహములో కండలు ఉండినంతవరకు కన్నులలో కొవ్వు పెరుగుతుంది. సత్యమును అసత్యముగను, అసత్యమును సత్యముగను చూస్తూ ఉంటారు. ఈ అహంకారము విద్యనుండి యేర్పడినది కాదు. విద్యకు వినయమే భూషణము మరియు అత్యంత ప్రధానమైనది. కానీ, అహంకారము తనకు తాను కొని తెచ్చుకొనేది. తద్వారా మానవత్వము కేవలము అసురత్వంగా మారిపోతుంది.

## ఆత్మ, మనస్సు, శరీరము ఈ మూడింటియొక్క స్వరూపమే మానవత్వము

'నరః' అనే పదమునందున్న అంతరార్థమును చక్కగా గుర్తించాలి. 'రః' అనగా నాశనము; 'న' కాదు. నాశనము కానటువంటివాడు, నరుడు. నాశనము కాని నరుడనగా ఎవరు? అమృత పుత్రుడు. 'శృణ్వంతు విశ్వే అమృతస్యపుత్రః' అని ఉపనిషత్తులు చెప్పాయి. 'ఓ అమృత పుత్రుడా' అని ఎడ్రస్ చేసింది, ఉపనిషత్తు. అట్టి నరత్వమునకు 'క' కారము చేర్చినపుడు నరకత్వముగా మారిపోతుంది. స్వర్గమునకు గొని పోయేది నరత్వము,

sri sathyasai vachanamrutam

నరకమునకు గొనిపోయేది నరకత్వము! అనగా అసురత్వమే! నరకుడు అసురుడు. ఆత్మ దివ్యమైన దైవత్వము. యీ ఆత్మతత్త్వమనేది సర్వ మానవులందు ఉండినప్పటికి, అది అంత స్పష్టముగా గుర్తించటానికి వీలుకాదు. దీనిని గుర్తించవలెనన్న చిత్తమును అభివృద్ధి గావించుకోవాలి. మానవత్వము ఆత్మ, మనస్సు, శరీరము యీ మూడింటియొక్క స్వరూపమే! శరీరమును అనుసరించేవాడు పశువుగా మారిపోతాడు. మనసును అనుసరించేవాడు రాక్షసునిగా మారిపోతాడు. ఆత్మను అనుసరించేవాడు దైవముగా రూపొందుతాడు. ఆత్మ, మనస్సు, శరీరము మూడింటిని అనుసరించేవాడు మానవుడుగా రూపొందుతాడు. నరకుడనగా కేవలము మనోదేహములను మాత్రమే అనుసరించేవాడు. కొన్ని సమయములందు పశువుగాను, మరికొన్ని సమయములందు అసురునిగాను ప్రవర్తించేవాడు. యిందులో దివ్యమైన దైవత్వము యేమాత్రము కనుపించదు. ఎవరు పశువు, ఎవరు అసురుడు, ఎవరు మానవుడు, ఎవరు దైవము అనేది మనకు మనమే సాక్షి. మనయందే అసురత్వము, మనయందే పశుత్వము మనయందే మనుష్యత్వము, మనయందే దైవత్వము యిమిడి ఉంటున్నవి. మానవునిలోని పశువు, మానవునిలోని అసురుడు, మానవునిలో మానవుడు, మానవునిలోని దైవము. దీనిని మనము చక్కగా విభజించుకొని సరియైన మార్గములో మానవత్వమును పోషించుకొనుటకు తగిన కృషి చేయాలి.

**సాధనలయందు ప్రేమ అనే ప్రాణతత్త్వము చేరినప్పుడే వాటికి పవిత్రమైన స్థానము చేకూరుతుంది**

మనము చేసే సర్వసాధనలు తాత్కాలికమైన తృప్తిని మాత్రమే అందించుచున్నవి. ఈ సాధనలయందు ప్రేమ అనే ప్రాణతత్త్వము చేరినప్పుడే వాటికి పవిత్రమైన స్థానము చేకూరుతుంది. 'ప్రేమ' అనగా ప్రాకృతమైనది కాదు. ఆలుబిడ్డల ప్రేమగానీ, ఆస్తిపాస్తుల ప్రేమగానీ, బంధుమిత్రుల ప్రేమగానీ ప్రేమ కాదు. ఇవి కేవలము యిచ్ఛాశక్తిపైన, అనురాగ శక్తిపైన ఆధారపడి ఉంటున్నాయి. ఒక్క దైవముపైన ప్రకటించే ప్రేమకు మాత్రమే 'ప్రేమ' అనే రెండక్షరముల పదము సార్థకమవుతుంది. ఈనాడు దీనిని గుర్తించలేక ప్రేమను అనేక

sri sathyasai vachanamrutam

రకములైన మార్గములలో ప్రవేశపెట్టి మానవులు తమ చిత్తమును మరింత మాలిన్యము గావించుకుంటున్నారు. పవిత్రమైన దివ్యత్వమును గుర్తించవలెనన్న 'ప్రేమ' అనే పవిత్రమైన అద్దముద్వారానే మనము దర్శించవచ్చు. ప్రాకృత చరిత్రయందు యీనాడు నరకాసుర సంహారమని భావిస్తారు. ఈ ప్రాకృతమైన చరిత్రను మనము కొంతవరకు విచారించి చూచిన నరకుడు ఒక రాక్షసుడని, అనేకమంది స్త్రీలను హింసిస్తూ వచ్చాడని, అనేకమందిని తన ఆధీనము గావించుకొని బంధించాడని, నిరంతరము రాగద్వేషములతో భౌతికమైన దేహానందమే నిత్యానందమని భావించి జీవితమును నాశనము గావించుకున్నాడని మనకు అవగతమవుతుంది.

**దుర్గుణములు కలిగినవాడు దుర్గుణములతోనే హతమైపోతాడు**

నరకాసురునికి క్రోధము చాలా అధికము. ఈ క్రోధమును రూపుమాపడానికి అనేక విధములైన మార్గములు మనం ప్రవేశపెడుతూ ఉంటాం. కానీ, భగవంతుడు దీనికి ఒక సులభమైన మార్గమును కనిపెట్టాడు. మానవునికి కోపం అధికంగా వచ్చేకొలది అతనియందున్న యింద్రియశక్తి నిర్వీర్యమైపోతుంది. ఒక్కతూరి మానవునకు కోపము వచ్చిందంటే మూడునెలలు భోజనము చేసిన శక్తి క్షీణమైపోతుంది. ఈ విధంగా క్రోధముచేత నరములన్నీ బలహీనములైపోతాయి. నిత్యజీవితములో మనకు చక్కగా అర్థమయ్యేది, కోపము వచ్చిన మానవునకు దేహమంతా అదిరిపోతుంది. శరీరమంతా వేడెక్కుతుంది. పెదవులు, చేతులు అదిరిపోతాయి. క్రమక్రమేణా రక్తము వేడెక్కిపోతుంది. ఈ వేడెక్కిన రక్తము చల్లారాలంటే చాలా కాలము తీసుకుంటుంది. ఈ రక్తము వేడెక్కి కట్టకడపటికి యింద్రియములను నిర్వీర్యము గావిస్తుంది. నరకాసురునికి అమితమైన కోపము. కృష్ణుడు అతని కోపమును చల్లార్చి యింద్రియములను శాంతపరచి తన శక్తి సామర్థ్యములను నిర్వీర్యము గావించాలని అనేక పర్యాయములు నరకాసురునిపై యుద్ధమునకు పోవటము, వాడు కోపముతో వచ్చేటప్పటికి తిరిగి వెనుకకు రావటము ఇలా జరిగింది. ప్రాకృత దృష్టితో చూచే జనులు 'అయ్యో! నరకాసురుని చూచి కృష్ణుడు పరుగెత్తి పోతున్నాడ'ని భావిస్తూవచ్చారు. ఈ విధంగా కృష్ణుడు అనేక పర్యాయములు

sri sathyasai vahini amrutam

నరకాసురునిపై యుద్ధమునకు వెళ్లి అతనికి కోపము తెప్పించి తాను వెనుకకు రావటంచేత క్రమక్రమేణా నరకాసురునిలో ఉండిన శక్తి పూర్తిగా నిర్వీర్యమైపోయింది. స్త్రీలను బాధించిన వ్యక్తిని స్త్రీలద్వారానే హతమార్చాలి. కత్తి పట్టినవాడు కత్తితోనే హతమైపోతాడు. తుపాకి పట్టినవాడు తుపాకితోనే హతమైపోతాడు. ఏ దుర్గుణములు కలిగినవాడు ఆ దుర్గుణములతోనే హతమైపోతాడు. యిది ప్రకృతి శాసనము. ఆ విధంగా నరకాసురుని బలహీనుని గావించిన తరువాత కృష్ణుడు తాను చంపకుండా సత్యభామను తీసుకువెళ్లి సత్యభామచేత చంపించాడు. యిది ప్రాకృతమైన చరిత్ర. అయితే ఆ సత్యభామ ఎవరు? ఈ క్రోధమును అసూయమాత్రమే చంపగలదు. అసూయను క్రోధమే చంపగలదు. ఆసూయకు, క్రోధమునకు విరుద్ధమైన మార్పులు ఉంటుంటాయి. సత్యభామ అనగా ఎవరు? అసూయ. కృష్ణుని ఎవరైనా ప్రేమిస్తూన్నారంటే, కృష్ణుడు ఎవరింటికైనా వెళ్లినాడంటే తాను నిద్రపోదు, భోజనము చేయదు. అంత అసూయతో మండిపోతూ ఉంటుంది. కృష్ణుడు తనవాడుగానే ఉండాలి. యింక మరొకరివాడుగా ఉండకూడదు. యిదే పెద్ద అసూయ. ఈ అసూయ అనేది మనిషికి కనుపించేది కాదు. యిది వేరుపురుగువంటిది. చెట్టు చాలా కళకళలాడుతూ ఉంటుంది. కానీ, యీ వేరుపురుగు వేరులో చేరి ఒక్క దినములో ఆ చెట్టును పడకొడుతుంది. అదే విధముగా సత్యభామ సత్యమైన అసూయాస్వరూపము. ఆమెకు ఎటువంటి అసూయ అనగా దీనికి మరొక ఉదాహరణము. రాధ అంటే కృష్ణునికి మహాప్రాణము, కృష్ణుడంటే రాధకు ప్రాణము. రాధ అనే పేరును సత్యభామ తాను ఉచ్చరించేది కాదు. కృష్ణునితో యేమైనా సంభాషించే సమయములో ఆమెను 'అక్కడకు వెళ్లివచ్చావా?' అని అడిగేవాడు. కృష్ణునికి అంతా తెలుసు. కానీ, లీలానాటక సూత్రధారి 'ఎక్కడికి' అని ప్రశ్నించేవాడు. అక్కడికే! ఎక్కడికి? తిరిగి ప్రశ్న. అక్కడికే! కట్టకడపటికి ఆమె ఎవరి దగ్గరకు వెళ్ళి వచ్చిందో వారి పేరు చెప్పమన్నాడు. కాని, సత్యభామ ఆ పేరు చెప్పటానికి యిష్టపడేదికాదు. పేరు తిన్నగా చెప్పకుండా 'ధార' అని తిప్పి చెప్పేది. ఆ ధారను త్రిప్పి చెపితే రాధ అవుతుంది. ఆ పేరును సరిగా చెప్పేది కాదు. అంతటి అసూయా బుద్ధి, సత్యభామకు. కనుక యీ అసూయను రూపుమాపాలని కృష్ణుడు సంకల్పించుకున్నాడు. తన సొత్తైన సత్య, తన అర్ధాంగి అయిన

sri sathyasai vahanamrutam

సత్య, అసూయతో ఉండినప్పుడు కృష్ణుని పేరు, ప్రతిష్ఠలే పాడైపోతాయి. కనుక మొట్టమొదట సత్యభామయొక్క అసూయను నిర్మూలము గావించాలి. అదియే కృష్ణతులాభారము. నారదుడు యింటికి వచ్చినప్పుడు యీ సత్యభామ కోరిన కోరిక ఒక్కటే! 'నారదా! కృష్ణుడు నావాడయ్యేదానికి యే జపమో, యే తపమో, యే యజ్ఞమో, యే మంత్రమో, యే తంత్రమో నాకు బోధించమ'ని అడిగేది. ఇదంతా కృష్ణుడియొక్క మాస్టర్ ప్లాను. నారదుడు చక్కగా బోధించాడు. 'అమ్మా! కృష్ణుడు ఎల్లప్పుడు నీవానిగా చేసుకోవటానికి ఒక వ్రతము ఉంటున్నాది. అది ఆచరిస్తే కృష్ణుడు నీవాడే అయిపోతాడు. ఇక ఎవ్వరివాడు కాడు. ఆ వ్రతము నీవు చేయగలవా?' అని అడిగాడు నారదుడు.'కృష్ణుడు నావాడు కావటానికి ఏమైనా వ్రతము చేస్తాను. నా తండ్రి యిచ్చిన శమంతకమణితో దినము ఎన్నో టన్నుల బంగారము లభిస్తుంది. కావలసినంత ధనము నా దగ్గర ఉంటున్నాది. ఏ వ్రతమైనా నేను చేయగలను' అని అహంకారముతో చెప్పింది. ఇలా అసూయకు, అహంకారముకూడా చేరింది. ఈ రెండును చేరేటప్పటికి పట్టలేనంత చెడ్డ భావాలు ప్రారంభించాయి. అప్పుడే నారదుడు 'పతిదానము' అనే వ్రతము చేయమన్నాడు. 'ఆ వ్రతము మూడు దినములు చేసి నాల్గవదినము పతిని ఎవరికైనా దానము యివ్వాలి. ఆ దానము యిచ్చిన వ్యక్తికి సరిసమానముగా ధనము యిచ్చి పతిని తీసుకుంటే పతి నీవాడు తప్ప ఎవ్వరివాడు కాదన్నా'డు. కృష్ణుని తీసుకుని నిరంతరము కృష్ణుని నావాడుగానే చేసుకుంటానని సత్యభామ విర్రవీగింది. వ్రతము గావించింది. మూడు దినములైన తరువాత కృష్ణుని ఎవరికో దానము యివ్వాలి. 'నారదా! ఎవరికి దానము యిచ్చేది?' అని ప్రశ్నించింది. అప్పుడు నారదుడు 'సత్యభామా! వగచేది ఎందుకు? నేను ఉన్నాను కదా! నాకే దానము యిచ్చేసేయి' అన్నాడు. 'యింతకంటే మహా భాగ్యమా! బ్రహ్మమానసపుత్రుడైన నారదునికి నా పతిని దానమిచ్చి తిరిగి నారదుని దగ్గరే తీసుకోటము ఎంత భాగ్యమ'ని ఆనందించింది. త్రాసులో కృష్ణుడు ఒకవైపున కూర్చున్నాడు. రెండవవైపు నగలు తెచ్చి పెట్టింది. కామక్రోధలోభమోహ మదమాత్సర్య, తమో గుణ, రజో గుణములు ఎనిమిది. యింక ఎనిమిది అష్టమదములు. ఎనిమిది, ఎనిమిది చేరి 16 కళలు అయినాయి. ఈ పదహారు కళలు ప్రతి మానవునియందు ఉంటున్నాయి. భగవంతునికి పదహారు కళలు

srisathyasaivachanamrutam

అని చెప్పడంలో భగవంతుడు ఆత్మస్వరూపుడు. మానవునియందుకూడను పదహారు కళలు ఉంటున్నాయి. దానవత్వము ఉంటున్నది. పశుత్వము ఉంటున్నది. మానవత్వము ఉంటున్నది. అన్నీకూడను మానవునియందే ఉంటున్నాయి. ఈ సహస్రారచక్రముపైన 16 వేల దళములు ఉంటున్నాయి. మూలాధారమునుండి ప్రారంభమైన కుండలినీ శక్తి, సహస్రారములో చేరేటప్పటికి శాంతి నెలకొంటుంది. కనుకనే ఆ పదహారువేలమందిని సంరక్షించాడు. ప్రాకృతికంగా యీ పదహారు వేలమంది గోపికలు కృష్ణుని ప్రార్థించారు. 'అమ్మా! మీరు మీ గృహములకు వెళ్లి సుక్షేమంగా జీవించండి' అన్నాడు. ఆ పదహారు వేలమంది గోపికలు తమ తమ గృహములకు వెళ్లటానికి యేమాత్రము అంగీకరించలేదు. 'స్వామీ! యింతకాలము ఆ రాక్షసునియొక్క చెరలో జీవించి ఇప్పుడు మా గృహములకు వెళ్లితే లోకులు కాకులు, మమ్మల్ని అనేక విధములుగా మాట్లాడుతారు. యీ లోకనిందను మేము భరించలేము. రక్షించిన నీవే మమ్ములను కాపాడమ'ని చెప్పారు. 'బంధననుండి రక్షించిన మీరే మమ్మల్ని పోషించమ'ని ప్రార్థించారు. వారే పదహారు వేలమంది గోపికలు. యీ విధంగా భగవంతుని లీలలు గుణసంబంధమైన రీతిగా, ప్రాకృతమైన రీతిగాను, వైజ్ఞానిక రీతిగాను అనేక రీతులుగా లోకానికి చాటుతూ వచ్చాడు, కృష్ణుడు. ఆధ్యాత్మిక తత్త్వము, ఆధ్యాత్మిక అర్థము, అంతర్భావము. ప్రాకృతమైన అర్థములు వెలుపల ఉంటున్నవి. బయట ఉన్నటువంటివి reflection of the inner being. వాటి ప్రతిబింబములే! బాహ్యముగా జరిగినటువంటిది, నరకాసుర రాక్షసవధ. అంతర్భావములో జరిగినది దుర్గుణములయొక్క నిర్మూలము.

**అన్ని దుర్గుణములకంటె అహంకారము, అసూయ చాలా చెడ్డవి**

ప్రతి మానవుడుకూడను తనలో ఉండినటువంటి దుర్గుణములను నిర్మూలము చేసుకోవాలి. అన్ని దుర్గుణములకంటె అహంకారము, అసూయ చాలా చెడ్డవి. అహంకారము ఎట్టి మానవునైనా క్షణములోపల క్రిందకు తోసి వేస్తుంది. అసూయ అనేది చాలా నెమ్మదిగా లోపల ప్రవేశించి జీవితమునే నాశనము గావిస్తుంది. కనుక, అసూయను ఏమాత్రము మనలో ప్రవేశింపచేసుకోకూడదు. నరకాసుర వధ అంటే

sri sathyasai vahini vachanamrutam

మానవునియందుండిన అహంకార, అసూయ, ఆడంబరములాంటి దుర్గుణములను దూరము గావించుకునే నిమిత్తము జరిగే చరిత్ర. మానవునకు అనేక కష్టములు, నష్టములు, అడ్డు తగులుతుంటాయి. మానవుడు మానవుడుగా బ్రతుకవలెనన్న అనేక కష్టములను, నష్టములను ఎదుర్కోవాలి. వీటిని ఎదుర్కొని, మానవత్వమును నిలబెట్టుకొని సాధించినప్పుడే మానవజన్మ సార్థకమవుతుంది. కనుక మానవత్వమునందున్న అసురత్వము అనే దుర్గుణములను నిర్మూలము గావించుకోవాలి. దీనికే త్యాగరాజుకూడా చెప్పాడు: "రామా! ఒక్కొక్క యుగమునందుకూడను నీవు అహంకారమును నిర్మూలించే నిమిత్తమై ఎన్నో విధములైన నాటకము లాడుతూ వచ్చావు. త్రికాలములకు అతీతుడవు. 'యథోవాచో నివర్తంతే అప్రాప్యమనసా సహ'. మనస్సుకు, వాక్కునకు అతీతుడవు."

**వాచామగోచరుండవు నీ చరితములు పొగడ బ్రహ్మాదులకైన తరమా!**
**హే కృష్ణా! కాచుకున్నాను, నా మొర ఆలకించి బ్రోవుమయ్య**
**కాలుడు గొనిపోయిన గురుపుత్రుని తెచ్చి యిచ్చినావు**
**కాలుని మదమణచినావు, వసుదేవదేవకీ చెర విడిపించినావు**
**వాల్గంటియైన ఆ ద్రౌపది 'హా కృష్ణా!' యని మొరలిడ**
**బ్రోచినావు, మేలుమేలు పాండవులను గాచినావు.**
**కుచేలుని ఆర్తి దీర్చినావు కురూపియైన కుబ్జ వక్రములను పోగొట్టినావు,**
**పదహారు వేల రమామణులను బ్రోచినావు**

**భగవంతునికి సమీపంగాపోతే భగవంతుని గుణములు మనకు లభించి హాయిని చేకూరుస్తాయి**

'కృష్ణుడు పదహారు వేలమంది గోపికలను సాకినాడు' అంటే ఏమి? వారిని రక్షించి అన్ని విధాలా పోషించుకుంటూ వచ్చాడు. కేవలము పదహారు వేలమందినే కాదు, యావత్ జగత్తును తాను పోషించుతూ వస్తున్నాడు. ఎవరు 'కృష్ణా!' అని ఆయనకు అర్పితమవుతూ వచ్చారో వారందరిని తాను రక్షిస్తూ వచ్చాడు. కానీ శరణాగతులు కానివారిని తాను రక్షించటంలేదు. కారణం ఏమిటి? ప్రతిదానికి ఒక్కొక్క శాసనం ఉంటున్నది. దూరంగా



srisathyasaivachanamrutam

ఉండే కొండలో నిప్పు మనకు కనుపిస్తున్నాది. కాని, ఆ నిప్పుయొక్క వేడిగాని, వెలుతురుగానీ మనకు యేమాత్రము సహాయము చేయటం లేదు. ఆ నిప్పుకు సమీపముగా పోయినప్పుడే వారికి ఆ వెలుగు, వేడి అనుభూతికి వస్తుంది. సమీపమునకు పోకుండా దూరమునుంచి ఆ వెలుతురు కనుపిస్తున్నాదంటే అది మనకు యేమాత్రము సహాయపడటం లేదు. కనుకనే ఉపనిషత్తులన్నీ 'ఉప' అనగా సమీపములో కూర్చోమని బోధిస్తూ వచ్చాయి. 'ఉపనిషత్' అనే పదమునకు అర్థము, ఉప-సమీపము, ని-క్రింద, షత్-కూర్చో. 'నీవు సమీపములో క్రింద కూర్చో!' అని ఆదేశిస్తున్నాయి. భగవంతునికి సమీపములో కూర్చోవాలి. అప్పుడే నీకు అనుభూతి కలుగుతుంది. ఏదో భక్తి, భక్తి అని ఎక్కడో ఉంటే అది లభ్యము కాదు. ఒక ఏసీ మన రూములో పెట్టుకున్నాము. ఆ ఏసీకి సమీపములో కూర్చుంటే మన వేడంతా పోతుంది. ఏసీ చల్లదనము మనకు లభించి హాయి కూరుస్తుంది. అదే శీతాకాలంలో హీటర్ పెట్టుకుంటే బయట చల్లదనమంతా పోతుంది. హీటర్ వేడి మనకు హాయిని చేకూరుస్తుంది. అదే విధముగనే భగవంతునికి సమీపముగా పోతే భగవంతుని గుణములు మనకు లభించి మనకు హాయిని చేకూరుస్తాయి. భగవంతునికి దూరంగా ఉంటే దుర్గుణములు బలపడిపోతాయి. కనుక ఉపనిషత్తులు 'ఉప' సమీపమునకు, దగ్గరకు 'పో,' 'దగ్గరకు పో' అని గుర్తు చేస్తాయి. దీనినే వేదముకూడను 'దూరాత్ దూరే అంతికేచ' అన్నాయి. 'అయ్యా! మీరు దూరము దూరము అనుకుంటున్నారు. కాదు కాదు; ఎంత దూరముగా ఉన్నామనుకుంటామో అంత దూరముగా ఉంటావు. ఎంత సమీపమనుకుంటామో అంత సమీపంగా ఉంటావు' అని బోధిస్తున్నది. యివన్నీ దృష్టి దోషములేగానీ, సృష్టి దోషములు కాదు.

**మంచి, చెడులు మన భావదోషములేకాని, ప్రకృతి దోషములు కాదు**

మీకందరికి బాగా తెలుసును. మహాభారతములో ఘట్టములంతా ఉంటున్నాయి. ఒకానొక సమయములో కృష్ణుడు దుర్యోధనుని పిలిచాడు. 'నాకు చాలా అవసరముగా ఉంటున్నాది. నీవు రాజ్యమంతా తిరిగి ఎవరైనా మంచివాడు ఒకడుంటే తీసుకొని రా! యిక ముమ్మందు యుద్ధములోపల తగినంత యేర్పాట్లంతా చేయాలి. నీవు తక్షణమే రాజ్యములో

srisathyasaivachanamrutam

మంచివాడు ఉంటే పిలుచుకొని రా!' అన్నాడు. దుర్యోధనుడు వెళ్లి రాజ్యములో బాగా సంచారము చేశాడు. వచ్చాడు, తిరిగి. దుర్యోధనుని పంపించిన తరువాత ధర్మజుని పిలిచాడు, కృష్ణుడు. 'ధర్మజా! మన రాజ్యములో ఎవరైనా చెడ్డవారు ఉన్నారేమో పిలుచుకొని రా!' అన్నాడు. ధర్మరాజు వెళ్లాడు అంతా చక్కగా పరిశోధన చేశాడు. తిరిగి ఒకరి తరువాత ఒకరు వచ్చారు. అప్పుడు కృష్ణుడు దుర్యోధనునితో 'బావా! ఎవడైనా చిక్కాడా మంచివాడు?' అని అడిగాడు. 'ఒక్కడైనా మంచివాడు లేడు. నీకేమైనా పని ఉంటే నాకంటే మంచివాడు ఉన్నాడా? కాబట్టి నన్నే పెట్టుకో' అన్నాడు దుర్యోధనుడు. 'సరే సంతోషము,' అన్నాడు కృష్ణుడు. కొంతసేపటికి ధర్మజుడు వచ్చాడు. 'ఏమి ధర్మజా! ఎవరైనా చెడ్డవాడు చిక్కాడా!' అని అడిగాడు కృష్ణుడు. 'నా రాజ్యములో చెడ్డవారు ఉంటారా? అంతో యింతో చెడ్డ ఉంటే నాలోనే ఉండవచ్చును గానీ, అందరు మంచివారే,' అని చెప్పాడు ధర్మరాజు. అనగా దీనియొక్క అంతరార్థము ఏమిటి? దుర్యోధనునికి నిరంతరము చెడ్డభావాలే ఉంటున్నాయి. చెడ్డభావము ఉన్నవారికి అందరు చెడ్డగానే కనుపించారు. ధర్మజుని హృదయంలో అంతా మంచి భావములే ఉంటున్నాయి. కనుక అందరు మంచివారుగానే కనుపించారు. రెండుకూడను వారి భావదోషములేగానీ, ప్రకృతి దోషములు కాదు. అందుకే చెప్పారు. 'యద్భావం తద్భవతి.' భావము కొలది సత్యము ఉంటున్నాది. నీ చెడ్డబుద్ధులవలన నీవు చెడ్డ అయిపోతున్నావు. మంచితనమువలన మంచి అయిపోతున్నావు. ఏ రంగు అద్దాలు వేసుకొని చూస్తావో ప్రపంచమంతా ఆ రంగులోనే కనుపిస్తుంది. ధర్మజుడు ఎప్పుడూ పవిత్రమైన ధర్మము అనే అద్దములు వేసుకొని చూశాడు. కనుక అందరూ మంచివారే కనుపించారు. అద్దములో దోషము ఉందిగానీ జగత్తులో దోషము లేదు. కారణం ఏమిటి? అంతా భగవంతునియొక్క సృష్టే! సృష్టియొక్క దోషము ఏమాత్రము లేదు. దృష్టి దోషమును నిర్మూలము గావించుకోండి.

**మన నయనములనుంచి వచ్చే నారము నారాయణునికే అర్పితము గావించాలి**

ప్రతి మానవునియందు దుర్భావములు చేరి అనేక విధములైన సంకల్పములు అభివృద్ధిపరుస్తూ ఉంటాయి. కనుక, మన భావములు పరిశుద్ధము గావించుకోటానికి

srisathyasaivahini.org

భగవత్ప్రేమను అభివృద్ధిపరచుకోవాలి. యీ నరకచతుర్దశి దినము దుర్గుణములు దూరము గావించుకునే నిమిత్తమై యేర్పడినదని మనం విశ్వసించాలి. నరకకూపములోకి పోయే దుర్గుణములను మనము దూరము చేసుకోవాలి. 'నర' అనగా ఆత్మ అని మరొక అర్థము. యీ ఆత్మకు అవకాశము యిచ్చినది, ఆకాశము. ఆకాశము నుంచి వాయువు, వాయువునుండి అగ్ని, అగ్నినుండి జలము, జలమునుండి పృథ్వి. కాబట్టి ఆకాశమనగా ఏమిటి? నారముయొక్క రూపమే నారాయణుడని అన్నారు. నారము అనగా జలము. పంచభూతములకు నిలయుడైనవాడు, నారాయణుడు. మనము నారాయణుని నిమిత్తమై బాధపడాలిగానీ లోకనిమిత్తమై బాధపడకూడదు. అనేకమంది అనేక సందర్భాలలో ఏడుస్తూ ఉంటారు. యీ ఏడుపు దేనికోసం?

> **పుట్టినపుడు ఏడ్చినారు చచ్చినపుడు ఏడ్చినారు**
> **మధ్యమధ్య విషయాలకు ఎందుకెందుకో ఏడుస్తారు**
> **ధర్మగ్లాని సంభవింప ఉద్ధరింప ఏడ్చినార?**
> **సత్యస్వరూపునికై ఏడ్చినార ఎపుడైన?**
> **ఎందుకోసమేడ్చినారు? ఏడ్పుకోసమేడ్చినార!**

కాదు కాదు. అన్నింటికి ఏడ్వకూడదు. భగవంతునికొరకు ఏడవాలి. అదే నిజమైన నరునియొక్క విశిష్టత. ఎవరికోసం ఏడ్వాలి? ప్రభువుకోసం ఏడ్వాలి. భగవంతునికోసం ఏడ్వాలి. నారము అనగా జలము. నయనములనగా నేత్రములు. నార+నయనము=నారాయణము. 'మన నయనములలో వచ్చే ధారలు నారాయణునికొరకు మాత్రమే! లోకానికి ఏడ్వకూడదు,' అని దీనియొక్క అంతరార్థము. భగవంతునికోసం ఏడ్వాలి. కానీ పవిత్రమైన యీ కంటి ధారలు ప్రకృతికోసం విడచటమా? కనుక మన నయనములనుండి వచ్చే నారము నారాయణునికే అర్పితము గావించాలి. అదే పత్రము-దేహము, పుష్పము-హృదయము, ఫలము-మనస్సు, తోయమనగా ఆనందబాష్పములు. యివి భగవంతునికి అర్పితము చేయాలి. అంతేకానీ తోయమనుకొని ఏ ట్యాప్ నీరో, ఏ బావిలో నీరో భగవంతునికి అర్పితము చేయుటము కాదు.

srisathyasaivachanamrutam

**మన దేహమునుండి ఆవిర్భవించిన హృదయమనే ఫలమును భగవంతునికి అర్పించాలి**

నీ జీవితమునకు ఆధారమైన నీ దేహమునుండి వచ్చినటువంటివాటినే భగవంతునికి వదలాలి. ఈ దేహమనే వృక్షమునుండి వచ్చిన హృదయమనే ఫలమునే భగవంతునికి అర్పితము చేయాలి. ఈ దేహమునుండి ఆవిర్భవించిన హృదయమనే ఫలమునే అర్పితము చేయాలి. ఈ దేహమనే పంచభూతములనే మేఘములనుండి ఏర్పడిన జలమే భగవంతునకు అర్పితము చేయాలి. హృదయపుష్పము, మనస్సనే ఫలము, తోయమనే ఆనందబాష్పములు. యిదీ మనము అర్పితము గావించవలసినది. భగవంతునికి ఏదో పుష్పములు యిస్తారు. ఈ పుష్పములు రేపటికి వాడిపోతాయి. ఏదో ఫలములు తెస్తారు, యిస్తారు. ఆ ఫలము రేపటికి కుళ్లిపోతుంది. జలము తెస్తారు. ఆ జలములోపల పురుగులు చేరిపోతాయి. కాని, చెడిపోనటువంటిది హృదయపుష్పం. అట్టి పుష్పమును భగవంతునికి సమర్పించాలి. మానవత్వములో ఉండిన అహంకారమును నిర్మూలము గావించుకోటానికి, పరిశుద్ధమైన ప్రేమను మాత్రమే భగవంతునికి అర్పించాలి. ఆ ప్రేమచేతనే పరమాత్మని కట్టివేయాలి. ప్రేమపాశముతో పరమాత్మని కట్టివేసే ప్రేమను మీరు అభివృద్ధిపరుచుకోండి!

**(తేదీ 24-10-1992న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahamrutam